www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం మే 25 2024

5

చిత్తూరు

14 మందికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సార్వత్రిక ఎన్నికలు 2024లో భాగంగా పిఓ, ఎపీఓ, పోలింగ్ సిబ్బందికి ఇచ్చిన రెండవ దఫా శిక్షణ కార్యక్రమానికి గైర్హాజరైన 14 మందికి షోకాజ్ నోటీసులను కలెక్టర్ జారీ చేశారు. అందులో వారు సమర్పించిన వివరణ సంతృప్తికరంగా లేనందున ఐదుగురిని సస్పెండ్ చేశారు. పోలింగ్ విధులకు గైర్హాజరైన 272 మందికి షోకాజ్ నోటీస్‌లు జారీ చేసినట్లుగా తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ అనేది ప్రజాస్వామ్యంలో ఒక గొప్ప బాధ్యతతో కూడిన కర్తవ్యమని, ఉద్యోగులు తమకు కేటాయించబడిన ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాలని తెలిపారు.

పకడ్బందీగా ఏపీపీఎస్సీ పరీక్షలు

ఏపీపీఎస్సీ పరీక్షల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న డిఆర్ఓ బి.పుల్లయ్య

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉపవిద్యాశాఖ అధికారులు నియామకం కోసం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈనెల 25న పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని, సంబంధిత శాఖలు సమన్వయంతో పకడ్బందీగా పరీక్షలను నిర్వహించాలని డిఆర్ఓ బి.పుల్లయ్య అన్నారు. ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణకు సంబంధించి శుక్రవారం వివిధ శాఖల అధికారులతో డిఆర్ఓ తన ఛాంబర్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఉద్యోగాల కోసం ఈనెల 25న జిల్లా వ్యాప్తంగా మూడు కేంద్రాలలో ఆబ్జెక్టివ్ టైప్ పరీక్షలను నిర్వహించనున్నారని, ఈ పరీక్షలకు 730 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. చిత్తూరులోని సీతమ్స్ కళాశాలలో 150 మంది, పూతలపట్టులోని వేము ఇంజనీరింగ్ కళాశాలలో 330 మంది, పలమనేరులోని మదర్ తెరిసా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 250మంది అభ్యర్థులు కాంపిటీటివ్ ఎగ్జామ్స్ రాయినున్నారని అన్నారు. పరీక్షా సమయం ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు ఉదయం 7 నుంచి 8.30 గంటల మధ్య మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని, క్షణం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని అన్నారు. పరీక్ష రాసే వారిలో దివ్యాంగులు ఉన్నట్లయితే తనకంటే తక్కువ విద్యార్హత ఉన్న వారిని సహాకులుగా తమ వెంట తీసుకురావాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థుల రవాణా సదుపాయం కోసం ఆర్టీసీ వారు తగు ఏర్పాట్లు చేయాలని, ఆబ్జెక్టివ్ తరహాలో కంప్యూటర్ల మీద పరీక్ష ఉన్నందున నిరంతర విద్యుత్ ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ వారు ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేసుకోవాలని, పోలీస్‌శాఖ వారు తగిన బందోబస్తు నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైలు ఫోన్‌లు, డిజిటల్ వాచ్‌లు వంటి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరని, హాల్ టికెట్, గుర్తింపు కార్డు, వాటర్ బాటిల్‌ను మాత్రమే అనుమతిస్తారన్నారు. అభ్యర్థుల మొబైలు ఫోన్‌లను డిపాజిట్ చేసుకోవడానికి పరీక్షా కేంద్రాలలో తగిన ఏర్పాట్లు చేయాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు. పరీక్షా సమయంలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండేలా రెవెన్యూ, పోలీస్ అధికారులు చూడాలన్నారు. ఆర్టీసీ అధికారి కేశవమూర్తి, ట్రాన్స్కో అధికారి కేశవులు, డాక్టర్ శిరీష, సిఐ కులాయప్ప, ఎస్ఐ ఉమామహేశ్వర్ రెడ్డి, సి సెక్షన్ సూపరింటెండెంట్ గుణశేఖర్ రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ అంజనా తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల దందా

అడ్వాన్స్ బుకింగ్ అంటూ పిఆర్‌ఓల హడావిడి

అదేదారిలో ప్రయివేటు పాఠశాలల కాన్వాసింగ్

కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ నిర్లక్ష్యం

ప్రజాశక్తి-తిరుపతి

" మేడం...! భార్గవ్ .. మీ అబ్బాయేగా. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో పాసయ్యాడు. అందుకే వెతుక్కుంటూ మీ ఇంటికి వచ్చాం. ఇంటర్‌లో మంచి కళాశాలలో చేర్పిస్తేనే మీ అబ్బాయి భవిష్యత్తు బాగుంటుంది. మా కళాశాలలో కొంచెం ఫీజు ఎక్కువైనా నాణ్యమైన విద్యను అందిస్తాం. ఇంటర్‌తో పాటే ఎంసెట్‌కు ప్రత్యేక తర్ఫీదును ఇస్తాం. అంతే కాదు ఐసి, ఎసి బ్యాచ్‌లనూ రన్ చేస్తున్నాం. రెండు దశాబ్దాలుగా రాష్ట్ర స్థాయి ర్యాంకులన్నీ మావే. ఒకవేళ ఈ ప్రభుత్వమూ ర్యాంకులను ప్రకటించి ఉంటే అత్యుత్తమ ర్యాంకులన్నీ మావే. ఇదిగో మా కళాశాల ప్రత్యేకతలతో కూడిన బ్రోచర్‌ను చూడండి. మాకున్న పేరు రాష్ట్రంలో ఏ విద్యాసంస్థకూ లేదు. సాధారణ విద్యార్థులను సైతం స్టేట్ ర్యాంకర్లుగా తీర్చిదిద్దిన ఘనత మా కళాశాలదే. ఇప్పుడు మీరు తొందరపడకుంటే మళ్లీ మా కళాశాలలో సీటు దొరకడం అంత సులభం కాదు. పైగా ఇప్పుడే అడ్వాన్స్ బుకింగ్ (రిజిస్ట్రేషన్) చేసుకుంటే మీకు ప్రత్యేక రాయితీ ఇస్తాము. ప్రస్తుతానికి రూ. 2 వేలివ్వండి. మిగిలింది పిల్లాడిని చేర్పించేటప్పుడు చెల్లిస్తే చాలు. ఇదిగో దరఖాస్తు ఫారం. వీటిని నింపి సంతకం పెట్టండి "

- ఇదీ తిరుపతిలో ఓ ప్రముఖ కార్పొరేట్ కళాశాల పిఆర్‌ఓల హడావుడి

" సార్..!. మీ ఇంట్లో బడి ఈడు పిల్లలున్నారా... ఉంటే మా పాఠశాలలోనే చేర్పించండి. ఎల్‌కెజీ నుంచీ 10 తరగతి వరకూ మా పాఠశాల పిల్లలందరూ ఇంగ్లీషులోనే మాట్లాడేలా మేం తయారు చేస్తాం. మా పాఠశాలలో ఒకటో తరగతి నుంచే కంప్యూటర్ చదువులు చెప్పిస్తాం. ఇంగ్లీషులోనే గడగడా మాట్లాడించేస్తాం. మిగతా బడుల్లో ఉన్న అయ్యోర్లకంటే 10 రెట్లు బాగా చదువు చెప్పే టీచర్లు మా పాఠశాలలో ఉన్నారు. ఐదంతస్తుల పెద్ద భవనంలో స్కూల్‌ను ఏర్పాటు చేశాం. రానుపోను బస్సు సౌకర్యం ఉంది. ప్రత్యేకంగా కంప్యూటర్లు, ల్యాబ్, ప్లేగ్రౌండ్ ఉన్నాయి. తెల్లారి 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులు నిర్వహిస్తాం. పదో తరగతికి అయితే స్పెషల్ క్లాసులు, స్టడీ అవర్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ శిక్షణతో పాటు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతాం. ఈ కారణంగానే మా పాఠశాల విద్యార్థులు ప్రతిఏటా అత్యుత్తమ మార్కులు సాధిస్తున్నారు. నర్సరీ నుంచి 10 తరగతి వరకు మా పాఠశాలదే అన్నింటా అగ్రస్థానం. మీకు మీ పిల్లల భవిష్యత్తే ముఖ్యమని భావిస్తే, కొంత ఎక్కువ ఖర్చయినా ..వారి బాధ్యత మాకు అప్పగించండి"

- ఇదీ మంగళంలో ఓ కార్పొరేట్ పాఠశాల యాజమాన్యం కాన్వాసింగ్

వేసవి సెలవులు ఇంకా ముగియనే లేదు. ప్రయివేట్, కార్పొరేట్ యాజమాన్యాలు విద్యార్థుల్ని, వారి తల్లితండ్రుల్ని తమ వైపునకు తిప్పుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. విద్యార్థుల తల్లితండ్రుల వెంటపడుతూ వారికి గాలం వేసేందుకు సిద్ధమవుతున్నారు. పిఆర్‌ఓలను నియమించుకుని ఇంటింటికీ తిప్పుతూ తమ కళాశాలల్లో ఉన్నవీ లేనివీ అన్నింటినీ కలిపి విస్తృత ప్రచారం చేస్తున్నారు. రంగురంగుల బ్రోచర్స్ తో విద్యార్థుల తల్లిదండ్రుల్ని మభ్యపెడుతున్నారు. అడ్వాన్స్ బుకింగ్ అంటూ ఇంటర్‌లో అడ్మిషన్లను చేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల ఆయా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు పెద్దఎత్తున కమీషన్‌లు ఇచ్చి వారి ద్వారానే విద్యార్థుల తల్లితండ్రులకు ' పలానా కళాశాలలో చదువు బాగా చెబుతారు. మేము మీకు రెకమండ్ చేస్తాం. ఫీజుకూడా తగ్గించేలా చూస్తాము ' అని చెప్పించి , తద్వారానూ అడ్మిషన్లను చేస్తున్నారు. వీరి మాటలు నమ్మి ఆ కళాశాలలో చేరిన తర్వాత గానీ పిఆర్‌ఓలు తొలుతగా చెప్పిన ఫీజుకు, ఆయా కళాశాలలు వసూలు చేస్తున్న ఫీజులకు ఏమాత్రం సంబంధంలేదన్న విషయం తెలియడం లేదు. ఇక చేసేది లేక విద్యార్థుల తల్లితండ్రులూ కార్పొరేట్ కళాశాల అడిగినంతా ఇవ్వకతప్పడం లేదని వాపోతున్నారు. పాఠశాలల స్థాయిల్లోనూ ప్రయివేటు యాజమాన్యాలు పోటీలు పడి మరీ ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థుల్ని తమ వైపుకు తిప్పుకునేందుకు పెద్దఎత్తున కాన్వాసింగ్ చేస్తున్నారు.

ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకోవాలి

రవి, ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా

పదో తరగతి పరీక్షలు ముగియకుండానే కొన్ని ప్రైవేటు కార్పొరేట్ యాజమాన్యాలు పెద్దఎత్తున కాన్వాసింగ్ చేస్తూ వచ్చింది. ఇప్పుడేమో అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటున్నారు. ప్రైవేటు స్కూళ్లలోనూ టీచర్లకు టార్గెట్‌లను ఇచ్చి మరీ అడ్మిషన్లను చేస్తున్నారు. ఇవన్నీ నిబంధనలకు విరుద్ధమని అటు డిఇఒ, అటు ఆర్‌ఐఒలకూ తెలుసు. ఇలాంటి విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు రాతపూర్వకంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశాం. అయినా స్పందన లేదు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలేమో బరితెగించి వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాటిపై చర్యలు తీసుకోకుంటే విద్యాసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు తీవ్రతరం చేస్తాం. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఒకటికి రెండు సార్లు ఆలోచించి విద్యార్థులను కళాశాలలో చేర్పించాలి. కార్పొరేట్ యాజమాన్యాలు పెట్టే మార్కుల ప్రలోభాలకు లొంగకుండా వాస్తవంగా ఆలోచించి, మంచి కళాశాల, పాఠశాలల్లో చేర్పించాలి.

షోకాజ్ నోటీసులు రద్దు చేయండి

జిల్లా రెవెన్యూ అధికారికి ఫ్యాప్టో నాయకుల వినతి

జిల్లా రెవెన్యూ అధికారితో చర్చిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అనారోగ్య పరిస్థితులతో ఎన్నికల విధులకు హాజరుకాని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను వెంటనే రద్దు చేయాలని ఉపాధ్యాయు సంఘాల ఐక్య కార్యచరణ సమితి నాయకులు శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్యను కలసి వినతిపత్రం అందజేశారు. 14వ తేదీ ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ కింద నమోదు చేయాలని కోరారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణలో చిత్తశుద్ధితో శ్రమించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతం చేసిన ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు జిల్లా అధికార యంత్రాంగం తరపున డీఆర్ఓ అభినందనలు తెలిపారు.

300 దరఖాస్తులు.. 3 బోర్లు..

- అందని ద్రాక్షల వైయస్సార్ జలకళ..
- దరఖాస్తులు 300, అర్హత 156, అనుమతి 28, వేసిన బోర్లు..3

ప్రజాశక్తి- వెదురుకుప్పం

పంటపొలాల్లో సొంత డబ్బులతో బోర్లు వేసుకోలేని రైతులు, వ్యవసాయ బావులపై ఆధారపడిన చిన్న సన్న కారు రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం వైయస్సార్ జలకల పేరుతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే లక్ష్యసాధనలో ఈ జలకళ అందని ద్రాక్షల మారి ఈ పథకం అర్థాంతరంగా ఆగిపోయింది. గ్రామాల్లో బోర్లు వేయడానికి కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రాకపోవడం గమనార్హం. ఎన్నో ఆశలతో ఉచిత బోర్లుకు దరఖాస్తు చేసుకున్న రైతులకు చివరికి నిరాశ మిగిలింది.

ప్రతి మండలంలో ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులు వైయస్సార్ జలకళకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి బోరు లేకుండా, వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు తహశీల్దార్ కార్యాలయం నుంచి ధ్రువీకరణ పత్రం తెచ్చుకోవాలి. వెదురుకుప్పం మండలంలో మొత్తం 25 పంచాయతీలున్నాయి. 13 సచివాలయాలు ఉన్నాయి. వీటినుంచి 300 దరఖాస్తులు ఉపాధి హామీ కార్యాలయానికి అందాయి. వీటిలో 156 దరఖాస్తులు అర్హత పొందాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి 28 బోర్లకు ఆమోదం వచ్చిందని జిల్లాస్థాయి అధికారులు తెలిపారు. కాగా చివరికి ఎంపిక చేసి బోర్లు వేసింది మాత్రం 3. ఇందులో దేవర గుడిపల్లి పంచాయతీకి జైపాల్, బొమ్మయ్యపల్లి పంచాయతీలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన లక్ష్మణ్ రాజ్, తెట్టి గుండ్లపల్లికు చెందిన దేవరాజులు రైతుల పొలాల్లో బోర్లు వేశారు. దరఖాస్తు చేసుకుని అర్హత పొందిన రైతులకు నిరాశే మిగిలింది.

జూన్ 6 వరకు టపాకాయలు అమ్మరాదు..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జూన్ 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్ సమయంలో, తదనంతరం జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, శాంతిభద్రతలను పరిరక్షించే ఉద్దేశంతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అణచివేసి, అసాంఘీక శక్తుల ఏరివేతే లక్ష్యంగా జిల్లాలోని సమస్యాత్మక గ్రామాలలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ వీఎన్ మణికంఠ చందోలు తెలిపారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ వరకు నిరంతరం అనుమానిత ప్రాంతాలలో కార్డన్ అండ్ సెర్చ్‌లు నిర్వహిస్తామన్నారు. జిల్లాలలో ఎక్కడా కూడా జూన్ 6 వరకు బాణాసంచా విక్రయించరాదని, పెట్రోల్ బంక్ సిబ్బంది, యజమానులు విడిగా బాటిల్స్ లోగాని, క్యాన్‌లలో గాని పెట్రోల్, డీజిల్‌లను నింపరాదని తెలిపారు. ఎవరైనా ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను మీరి వ్యవహరిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎవరైనా విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన, ఘర్షణలకు పాల్పడిన కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఇతర సమయాలలో నమోదు చేసే కేసులు కన్నా, ఎన్నికల సమయంలో నమోదు చేసే కేసుల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. తద్వారా ఘర్షణలకు పాల్పడిన యువతకు ఎటువంటి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలను పొందలేరని తెలిపారు. కనుక యువత తమ ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఘర్షణలకు దూరంగా ఉండాలని, ప్రజలు సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. జిల్లా పోలీస్ అధికారులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించే సమయంలో ఎక్కడైనా బాణాసంచా లేదా బాటిల్లలో, క్యాన్‌లలో పెట్రోల్, డీజిల్ నింపి ఉంటే వాటిని సీజ్ చేయాలని, వాటిని ఎవరు విక్రయించారనే విషయాన్ని, తెలుసుకొని వారిపై కూడా కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఎవరైనా రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన, ఘర్షణలకు పాల్పడుతున్న వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్ కు గాని, డయల్ 100/112 నెంబర్లకు కాని లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 94409 00005కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ తెలిపారు.

బాలికల హాస్టల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విభిన్న ప్రతిభావంతుల బాలికల హాస్టల్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు ఏవై.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలో రెడ్డిగుంట, డిఎం అండ్ హెచ్ఓ ఆఫీస్ ఎదురుగా వున్న విభిన్న ప్రతిభావంతుల బాలికల హాస్టల్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. 1వ తరగతి నుండి 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఆపై తరగతులు చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన బాలికలకు ఇందులో ప్రవేశాలు కల్పిస్తామని, హాస్టల్‌లో ప్రస్తుతం 30 ఖాళీలు ఉన్నాయని, ప్రవేశం పొందిన వారికి ఉచితంగా భోజనం, వసతితో పాటు కాస్మోటిక్ చార్జీలు, ఒక సంవత్సరానికి నాలుగు జతల యూనిఫాం, నోటు పుస్తకాలు, ఇతర సదుపాయాలు కల్పించబడుతుందని పేర్కొన్నారు. వసతి గృహంలో ప్రవేశం పొందాలనుకునే బాలికలు సదరం (వైకల్య) ధ్రువీకరణ పత్రం ప్రకారం 40శాతం అంగ వైకల్యం దృవీకరణ పత్రం, టిసి, రేషన్ కార్డు, స్టడీ సర్టిఫికేట్, తదితర పత్రాలను జతచేసిన దరఖాస్తులను కలెక్టరేట్, అంబేద్కర్ భవన్‌లోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారి వారి కార్యాలయానికి అందజేయాలని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు నగరంలోని బాలికల వసతి గృహాన్ని నేరుగా సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు 94409 90698 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

తిరుమలలో భక్తుల రద్దీ

శ్రీవారి దర్శనానికి 40 గంటలు

ప్రజాశక్తి- తిరుమల: జూన్ 30వ తేదీ వరకు శుక్ర, శని, ఆది వారాలలో విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు టిటిడి వెల్లడించింది. వేసవి సెలవులు ముఖ్యంగా ఎలక్షన్లు పూర్తికావడం, విద్యార్థుల పరీక్షల ఫలితాలు విడుదలైన నేపథ్యంలో, తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతున్నది. ముఖ్యంగా, శుక్ర, శని, ఆదివారాలలో సామాన్య భక్తుల రద్దీ వలన, వారు దర్శనానికి సుమారు 30 నుంచి 40 గంటల సమయం వరకు క్యూ లైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి వుంది. సామాన్య భక్తులకు త్వరితగతిన శ్రీవారి దర్శనం కల్పించేందుకుగాను, జూన్ 30వ తేదీ వరకు శుక్ర శని, ఆదివారాలలో బ్రేక్ దర్శనం రద్దు చేయబడినది. ఇందుకుగాను, సిఫార్సు లేఖలు స్వీకరించబడవని, ఈ మార్పును గమనించి భక్తులు టిటిడికి సహకరించవలసినదిగా టిటిడి అధికారులు విజ్ఞప్తి చేయడం జరిగింది.

క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

28న కౌంటింగ్ సిబ్బందికి మొదటి విడత శిక్షణా తరగతులు : కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

సార్వత్రిక ఎన్నికలు -2024కు సంబంధించి జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియను రిటర్నింగ్ అధికారులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని విధాల పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షణ్మోహన్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, 172 - చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీనివాసులుతో కలసి 165 - పుంగనూరు,170- నగిరి, 171- జీడి నెల్లూరు,173- పూతలపట్టు,174- పలమనేరు, 175- కుప్పం నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులతో సమావేశమై కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి సిబ్బంది నియామకం, సిబ్బంది ర్యాండమైజేషన్, కౌంటింగ్ సిబ్బంది శిక్షణా తరగతుల నిర్వహణ, కౌంటింగ్ హాల్‌లో వీడియోగ్రఫీ, సీసీ కెమెరాలు ఏర్పాటు, నియోజకవర్గ స్థాయిలో శాంతి భద్రతల నిర్వహణ కౌంటింగ్‌కి రాజకీయ పార్టీల తరపున ఏజెంట్లను నియామకం సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు 2024కు సంబంధించి జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన అన్ని ఏర్పాట్లు రిటర్నింగ్ అధికారులు బాధ్యతతో చేయాలని, కౌంటింగ్ నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమన్నారు. సజావుగా కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకంపై దృష్టి పెట్టాలన్నారు. కౌంటింగ్ సూపర్వైజర్స్, అసిస్టెంట్ సూపర్వైజర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, మైక్రోఅబ్జర్వర్లు స్ట్రాంగ్ రూమ్ ఇంచార్జి, సిబ్బంది నియామకం పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ నిర్వహణకు కేటాయింపబడ్డ సిబ్బందికి మొదటి ర్యాండమైజేషన్ చేసిన అనంతరం జిల్లాస్థాయిలో ఈనెల 28న మొదటి విడత శిక్షణాతరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండో విడత శిక్షణ తరగతులు జూన్ 3న అబ్జర్వర్ల సమక్షంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రిటర్నింగ్ అధికారులు వారి నియోజక వర్గానికి సంబంధించి కౌంటింగ్ అసెంబ్లీ, పార్లమెంటు, విడివిడిగా జరుగుతుందని అందుకు అవసరమైన పూర్తి సిబ్బంది నియామకంను పూర్తి చేసుకోవాలని తెలిపారు. సిబ్బందికి గుర్తింపు కార్డులను అందజేయాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు కౌంటింగ్ సంబంధించి ఏజెంట్ల నియామకంలో రిటర్నింగ్ అధికారికి ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ప్రతి రౌండ్‌వారీగా సమాచారాన్ని మీడియా సెంటర్‌కు చేరవేసేందుకు సమాచార శాఖ తరపున ప్రతి నియోజకవర్గానికి ఒకరిని నియామకం చేయడం తెలిపారు. నియోజకవర్గాలలో శాంతిభద్రతల నిర్వహణకు రిటర్నింగ్ అధికారులు పోలీసు అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. కౌంటింగ్ కు ముందు గా విడుదలయ్యే ఎగ్జిట్ పోల్స్ నేపథ్యంలో జిల్లాలో ఎక్కడ శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా అప్రమత్తంగా ఉంటూ లా అండ్ ఆర్డర్‌ను నిర్వహించాలన్నారు. సమావేశంలో డిఆర్ఓ బి.పుల్లయ్య, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, రిటర్నింగ్ అధికారులు మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకటశివ, చిన్నయ్య మనోజ్ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జిల్లాలో పలు చోట్ల కార్డన్ సెర్చ్

- మద్యం, అనుమానిత వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా అంతటా ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పీల పర్యవేక్షణలో ఈనెల 24 శుక్రవారం జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు స్టేషన్‌ల పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది ముమ్మరంగా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించడం జరిగింది. అక్రమంగా దాచివుంచిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు, బాణాసంచా, పెట్రోలు, డీజిల్, మాదకద్రవ్యాలు, పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు, సరైన పత్రాలు లేని అనుమానిత వాహనాలను సీజ్ చేసే లక్ష్యంతో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రత్యేక బలగాలతో ఉదయం 5 నుండి 7.30 గంటల వరకు చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి సబ్ డివిజన్ల లోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో గల అన్ని మండలాలు, సమస్యాత్మక గ్రామాలలో డిఎస్పిల పర్యవేక్షణలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. చిత్తూరు సబ్ డివిజన్‌లోని చిత్తూరు 1, 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రశాంత్ నగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించగా సరైన పత్రాలు లేని 2 బైక్‌లు, ఆటోను సీజ్ చేయడం జరిగింది. అలాగే నగరి సబ్ డివిజన్ పరిధిలోని వెదురుకుప్పం పోలీసు స్టేషన్ పరిధిలో గల యనమలమంద గ్రామంలో 2000 లీటర్ల ఎఫ్‌జె వాష్‌ను కనుగొని దానిని ధ్వంసం చేసి 30 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. కుప్పం డివిజన్ పరిధిలోని కుప్పం అర్బన్ పోలీసుస్టేషన్ పరిధిలోని బాబు నగర్ ఏరియాలో 8 లీటర్ల మద్యం కనుగొని స్వాధీనం చేసుకున్నారు.

వెహికల్ చట్టాలపై అవగాహన ఎస్సై

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని ఆటో డ్రైవర్లకు, వాహనదారులకు శుక్రవారం మండల కేంద్రంలోని చెక్‌పోస్టు కూడలిలో ఎస్సై క్రిష్ణయ్య మోటారు వెహికల్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి కొత్త మోటార్ వెహికల్ యాక్ట్ అమల్లో ఉంటుందని వాహనదారులందరూ సహకరించాలని తెలిపారు. మద్యం తాగి వాహనం నడపరాదని, వాహనానికి సంబంధించిన అన్ని రకాల పేపర్లు దగ్గర ఉంచుకోవాలని తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపితే రూ. 2వేలు జరిమానా, రెండోసారి పట్టుబడితే మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ. 3వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

కూలడానికి సిద్ధంగా ఉన్న సోలార్ విద్యుత్ స్తంభం

ఒరిగిన సోలార్ విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల సినిమా క్రాస్ వద్ద విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నెల క్రితం ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ వీధిదీప స్తంభం గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఒరిగిపోయి కూలడానికి సిద్ధంగా ఉంది. మంత్రి ఆదేశాలతో సోమల పంచాయతీలో అనేక ప్రధాన కూడలలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఒక్కో సోలార్ విద్యుత్ దీపం రూ.24 వేలు నిధులు వెచ్చించి ఏర్పాటు చేశారు. సినిమా క్రాస్ వద్ద ఉన్న సోలార్ వీధి దీపం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఐదు రోజులుగా పక్కనే ఉన్న సీసీ కెమెరా స్తంభానికి ఒరిగిపోయి ఉంది. సోలార్ విద్యుత్ వీధిదీపం ఒకవేళ కింద పడితే తిరిగి బాగు చేయడానికి చాలా ఖర్చు అవుతుందని, ముందస్తుగా అధికారులు ఒరిగిపోయిన సోలార్ విద్యుత్ వీధిదీపాన్ని యధాస్థానంలో అమర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సోమలలో అడ్మిషన్ డ్రైవ్

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల పదవ తరగతి పాసైన విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని అధ్యాపక బృందం అడ్మిషన్ డ్రైవర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పదవ తరగతి పాసైన విద్యార్థుల ఇండ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులు ఉన్నారని నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. అధ్యాపకులు రవీంద్రారెడ్డి, శ్రీకాంత్, ఎంవి.సుబ్బయ్య, శివయ్య, రామకృష్ణ, సుధా పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత శిక్షణా తరగతులు

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని కళామందిర్ జరిగిన వేసవి ఉచిత శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిసినట్లు నిర్వాహకులు తులసి నారాయణ నాయుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత 15 రోజులుగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించామని, పిల్లల నైపుణ్యత మెరుగుపరచి ఆట, పాటలు, విద్య, క్రీడల్లో ప్రతిభ చూపించిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసినట్లు తెలియజేశారు. కార్యదర్శి పుష్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల గోదాములో తనిఖీలు

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: పట్టణ పరిధిలోని పౌరసరఫరాల గోదామును ఆర్డీవో వెంకటరెడ్డి తనిఖీ చేశారు. శుక్రవారం గోదాముకు సిబ్బందితో పాటు వెళ్లిన ఆయన ఆన్‌లైన్‌లో చూపుతున్న సరకు నిల్వ, గోదాములో ఉన్న సరకు నిల్వ ఒకేలా ఉన్నాయా? లేవా? అన్న అంశాలను పరిశీలించారు. బియ్యం, పోర్టిఫైడ్ బియ్యం, కందిపప్పు, పామోలిన్, రాగి పిండి, గోధుమ పిండి, చక్కెర నిల్వలను విడివిడిగా లెక్కించి సరిచూశారు. సరుకుల నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించారు. చూపుతున్న నిల్వల మేరకు గోదాములో సరకు ఉన్నట్లు తేల్చారు. సరకులను సరైన సమయాల్లో ఆయా దుకాణాలకు సరఫరా చేయాలని గోడౌన్ డీటీకి సూచించారు. ఈ తనిఖీలో డీఎస్‌వో శంకరయ్య, తహశీల్దార్ చంద్రశేఖర్, గోడౌన్ ఇన్‌చార్జి పి.ఆదం పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండలం కేంద్రంలో ఎఫ్‌సిఐ గోదామును ఆర్డీఓ చిన్నయ్య శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములోని స్టాకును, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ రవి, డిప్యూటి తహశీల్దార్ ఉన్నారు.

'మహిళా పాలిటెక్నిక్'లో జాబ్ అచీవర్స్ డే

ప్రజాశక్తి- పలమనేరు: ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, పలమనేరులో శుక్రవారం జాబ్ అచీవర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పలమనేరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మనోజ్ రెడ్డి, ప్రముఖ శాస్త్రవేత్త పవన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కళాశాలలోని వివిధ కోర్సులలో తృతీయ సంవత్సరం చదువుతూ విస్ట్రాన్, ఆవిజా కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఉద్యోగ ఎంపికలో అర్హత సాధించిన 70మంది విద్యార్థినులకు అపాయింట్ మెంట్ ఆర్డర్లను అందచేయడం జరిగింది. ఆర్‌డీఓ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యతో మెండైన ఉద్యోగ అవకాశాలున్నాయని, విద్యార్థినులు చిన్న వయసు లోనే ఉద్యోగాలు సంపాదించడం వల్ల త్వరగా కెరీర్‌లో పై స్థానాలకు చేరుకునే అవకాశం ఉన్నదని చెప్పారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహమూద్, విభాగాధిపతులు సాయిలక్ష్మి ప్రసన్న, డాక్టర్ శ్రీవిద్య, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ జయపాల్, సీనియర్ అధ్యాపకులు శివారెడ్డి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా 3906 మంది రైతులకు గాను వేరుశనగ విత్తనాలు1488 క్వింటాళ్లు పంపిణీ చేశామని నగరి వ్యవసాయశాఖ ఏడి సౌభాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలో గంగాధరనెల్లూరు పాపిరెడ్డిపల్లి, నెల్లేపల్లి, వేల్కూరు గ్రామాల్లో వేరుశనగ విత్తనాల బస్తాలు పంపిణీని ఏడీ తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారిణి వందన, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరు: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారి జి.రాజేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలం పరిధిలోని దాదాపు అన్ని ఆర్‌బికెలలో ఇప్పటివరకు 3835 మంది రైతులకి 1920 క్వింటాళ్ళ విత్తనాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, సుమారు 1120 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

ధర అదిరే.. జనం బెదిరే..

● కూరగాయల ఉత్పత్తి తగ్గి.. ● కిలో రూ.60-100 పైనే

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎండాకాలం... మండేకాలం.. దీంతో కూరగాయల సాగు గణనీయంగా తగ్గింది.. ఉత్పత్తి తగ్గిపోవడంతో కూరగాయల ధరలు ఉట్టెక్కాయి. టమోటా కిలో రూ.50-60 ధర పలుకుతుంటే, బీన్స్ కిలో 100-120 పైకి ఎగబాగింది. మరో నెలరోజుల పాటు ధరలు ఇలానే ఉండే అవకాశం ఉందని మార్కెట్ వ్యాపారులు చెబుతుండటం గమనార్హం. దీంతో జనం కూరగాయలు కొనాలంటే బెంబేలెత్తుతున్నారు.

సాధారణంగా తిరుపతి ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌కు ప్రతిరోజూ 15 నుంచి 20వేల మెట్రిక్ టన్నుల కూరగాయలు వస్తుంటాయి. ప్రస్తుతం 50 శాతం కూడా సరఫరా కావడం లేదని మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. వర్షాలు కురిస్తే గాని సాధారణ పరిస్థితులు నెలకొనవని, ఎండలు ఎక్కువగా ఉండడంతో, సాగునీరు లేక రైతులు కూరగాయలు పండించడం లేదని తెలిపారు. దీంతో తిరుపతి జిల్లా అవసరాలకు కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. జూన్ చివరి వరకూ ఇదే పరిస్థితి నెలకొననుంది.

తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి టమాటా, బీన్స్, క్యాప్సికం సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. కొన్ని రోజుల క్రితం వరకు చిత్తూరు, ఒంగోలు జిల్లాల నుంచి వచ్చేవి. తమిళనాడు, కర్ణాటక లోని కొన్ని జిల్లాల నుంచి నుంచి రోజూ 40 నుంచి 50 లారీల టమాటా దిగుమతి కాగా, ప్రస్తుతం 10 లారీలు మించడం లేదు. దీంతో బెంగళూరు, బెల్గాం, మదనపల్లి తదితర ప్రాంతాల నుంచి నగరానికి రోజుకు 30 నుంచి 35 లారీల టమాటా దిగుమతి చేస్తున్నారు. బీన్స్ నెల రోజులు క్రితం రోజుకు 2 నుంచి 4 టన్నులు దిగుమతి కాగా, ప్రస్తుతం టన్నుకు మించి రావడం లేదు. దీంతో వీటి ధరలు విపరీతంగా పెరిగినట్టు అధికారులు చెబుతున్నారు. చిక్కుడుకాయ కూడా మార్కెట్లో కనిపించడం లేదు.

రోజుకు రూ.150పైనే ఖర్చు

లక్ష్మమ్మ, తిరుపతి

కుటుంబంలో నలుగురు ఉంటే రోజుకు రూ.150పైనే ఖర్చవుతోంది. ప్రస్తుతం బీపీ, సుగర్ పెరిగిపోవడంతో డాక్టర్లు అన్నం తక్కువగా తిని, కూరలు ఎక్కువగా తినమని చెబుతున్నారు. ఆ విధంగా అలవాటు పడిన ప్రాణాలు, ప్రస్తుతం తగ్గించి తినాలంటే తినలేం. దీంతో ఎంత రేటు ఉన్నా కూరగాయలు కొనక తప్పదు, వండక తప్పదు, తినక తప్పదు. జిల్లాలోనే వేసవిలో కూరగాయల సాగుకు అధికారులు సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తే ఈ పరిస్థితి ఉండదు.

ప్రస్తుత ఆఫ్ సీజన్లో స్థానికంగా కూరగాయల దిగుమతులు ఎక్కువగా ఉండవు. దీంతో కమీషన్ ఏజెంట్లు ఇతర జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి మార్కెట్కు కూరగాయలు తెప్పిస్తారు. దీంతో వారు నిర్ణయించిన ధరలకే కొనాల్సి వస్తోంది.

సాగు లేకే అధిక ధరలు : కె.శ్రీధర్, స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి, గుడిమల్కాపూర్ మార్కెట్

ఏప్రిల్ నుంచి నగర శివారు జిల్లాల నుంచి కూరగాయల దిగుమతి తగ్గిపోయింది. మే నెలలో డిమాండ్ ఉన్నా సరఫరా 30 శాతం మించదు. సాధారణంగా వేసవిలో ఎండలు కారణంగా తోటలకు నీరు అందదు. దీంతో కూరగాయల సాగు అంతగా ఉండదు. నగర కూరగాయల అవసరాలు తీర్చడానికి ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు చేస్తున్నాం. టమాటా ధరలను నియంత్రించడానికి ఢిల్లీ నుంచి దిగుమతి చేసేందుకు ప్రణాళిక చేశాం.

ఢిల్లీలో పుంగనూరు విద్యార్థి మృతి

అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి
రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు
నాలుగు రోజులుగా ఎయిమ్స్ చికిత్స

ప్రజాశక్తి- పుంగనూరు

ఢిల్లీలో అగ్రికల్చర్ బీఎస్సీ చదువుతున్న పుంగనూరుకు చెందిన విద్యార్థి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా కారు ఢీకొని ఎయిమ్స్ ఆసుపత్రిలో నాలుగు రోజులు పాటు మృత్యువుతో పోరాడి శుక్రవారం మృతి చెందాడు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పుంగనూరు పట్టణం చింతలవీధికి చెందిన పగడాల రవికుమార్ రెడ్డి, తల్లి భవాని పారిశ్రామికవేత్తగా హైదరాబాదులో ఉన్నాడు. 'న్యూట్రికుక్ ఇండియా' కంపెనీని నిర్వహిస్తున్నాడు. ఇతనికి హర్షల్(21) కుమారుడు ఢిల్లీ సంస్కృతిక విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ బీఎస్సీ చివరి సంవత్సరాన్ని పూర్తి చేసుకున్నాడు. మూడు రోజుల్లో యూనివర్సిటీలో సర్టిఫికెట్స్ తీసుకొని తిరిగివస్తానని తల్లిదండ్రులకు తెలిపారు. అయితే ద్విచక్ర వాహనంలో 20వ తేదీన ఢిల్లీలో వెళుతుండగా కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృత్యువుడిలోకి జారుకున్నాడు. తల్లిదండ్రులు పగడాల రవి కుమార్, భవానీలు కుమారుని అవయవాలు దానం చేశారు. మృతదేహం శనివారం స్వస్థలమైన పుంగనూరుకు చేరుకుంటుందని అంత్యక్రియలు నిర్వహిస్తారని తెలిపారు.

ఆంక్షలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి- సోమల: టపాసుల విక్రయ లైసెన్సుదారులు ఎన్నికల ఫలితాల సందర్భంగా జూన్ 6వ తేదీ వరకు ఎలాంటి విక్రయాలు చేయరాదని, ఆంక్షలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్సై వెంకట నరసింహులు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో మండలంలోని టపాసుల విక్రయ లైసెన్స్ దారులను పిలిపించి విధివిధానాల గురించి తెలియజేశారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని టపాసుల దుకాణదారులు ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు ఎలాంటి టపాసుల విక్రయాలు జరపరాదని, తమ వద్ద ఉన్న టపాసుల స్టాకు వివరాలను పోలీసులు తెలిపి భద్రపరచాలని తెలిపారు.

గంగాధర నెల్లూరు: ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని పెట్రోల్ బంకు యాజమాన్యాలకు, టపాకాయల విక్రయదారులకు అధికారులు శుక్రవారం నోటీసులు అందజేశారు. గంగాధర నెల్లూరు గ్రామంలో వీఆర్వో రూహీ ఫాతిమా, సర్వేయర్ వాసు టపాకాయ యజమానులకు ఎన్నికల సంఘం ఆదేశాలను వివరించి నోటీసులు అందజేశారు. వీరక నెల్లూరు పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి భావన బిఎల్వోలు అమల దుకాణ యజమానులకు నోటీసులు అందజేశారు. కౌంటింగ్ ముగిసే వరకు టపాకాయలు విక్రయం, పెట్రోల్ బంకులలో బాటిళ్లలో పెట్రోల్ పట్టరాదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పుంగనూరు: పెట్రోలు డీజిల్ విక్రయిస్తున్న దుకాణాలు సీజ్ చేసినట్టు పుంగనూరు తహశీల్దార్ తెలిపారు. శుక్రవారం మండలంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. సుగాలి మిట్ట, వేంకటాద్రి కాలనీలో అక్రమంగా పెట్రోలు, డిజల్ అమ్మకాలు చేపట్టరాదని అలా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రెండు దుకాణాల్లో అక్రమంగా నిల్వ ఉంచినట్టు గుర్తించి వాటిని సీజ్ చేసినట్లు చెప్పారు.

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా కూడా జూన్ 6 వరకు బాణాసంచా విక్రయించరాదని, పెట్రోల్ బంక్ సిబ్బంది, యజమానులు విడిగా బాటిల్స్ లోగాని, క్యాన్‌లలో గాని పెట్రోల్, డీజిల్‌లను నింపరాదని మున్సిపల్ రెవెన్యూ అధికారి రవిరెడ్డి, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ ఇందిరా తెలిపారు. ఎవరైనా ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను మీరి వ్యవహరిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని పెట్రోల్ బంకుల్లో పెంట్రోల్, డీజిల్ లూజుగా బాటిల్స్‌లో, క్యాన్నుల్లో అమ్మరాదని పిఓపిఆర్డి పురుషోత్తం నోటీసులను జారీ చేశారు. శుక్రవారం పచ్చికాపల్లం పంచాయతీలో ఉన్న పెట్రోల్ బంకుల యజమానులకు నోటీసులను అందించారు.

పదకవితా పితామహుడు అన్నమయ్య

ప్రజాశక్తి - క్యాంపస్

అచ్చ తెలుగు పదాలతో కీర్తనలు రచించి సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన అన్నమయ్య పద కవితా పితామహుడిగా నిలిచారని తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ రామ సూర్యనారాయణ పేర్కొన్నారు. తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో శుక్రవారం సాహితీ సదస్సులు ప్రారంభమయ్యాయి. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన డా. రామ సూర్యనారాయణ "తాళ్లపాక కవులు - పద కవిత్వం" అనే అంశంపై ఉపన్యసిస్తూ, అన్నమయ్య పద కవిత పితామహుని తెలిపారు. వంశమంతా కవులైన ఖ్యాతి తాళ్లపాక వంశానికి చెందుతుందన్నారు. విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ మలయ వాసిని ' అన్నమయ్య కీర్తనలు - వస్తు వైవిధ్యం ' అనే అంశంపై ప్రసంగిస్తూ, అన్నమయ్య మధుర భక్తితో వస్త్రాశ్రయ సాహిత్యం, ఆత్మాశ్రయ సాహిత్యం అనే రెండు అంశాలతో తన సంకీర్తనలను రచించినట్లు చెప్పారు. వరంగల్లు కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కాత్యాయని విద్మహే 'అన్నమయ్య పద కవితలు - లౌకిక విలువలు' అనే అంశంపై మాట్లాడుతూ, లౌకిక జీవితం లేకుండా భక్తి లేదని, సమాజంలో, వ్యక్తిగతంగా వున్న సమస్యల పట్ల ఆందోళన చెందుతున్న సందర్భంలో భక్తులు అవుతారన్నారు. అన్నమయ్య ఆనాటి సామాజిక పరిస్థితుల్లో ఆకలి, కష్టాలు భగవంతుడిని గుర్తు చేస్తాయని తన కీర్తనల ద్వారా తెలిపారన్నారు. అన్నమయ్య తన కీర్తనల ద్వారా ప్రజలు జీవితంలో అక్రమ సంపాదన ఉండకూడదని, కొద్దిగా ఆయన గౌరవప్రదమైన సంపాదన ఉండాలని, ఇతరులను నిందించకూడదని, హాని చేయకూడదని, కోపము వంటి దుర్గుణాలను వదులుకోవాలని, అవసరం ఉన్నవారికి సహాయం చేయాలని తెలిపినట్లు చెప్పారు. భక్తి ఉద్యమంలో స్త్రీలు, పురుషులు సమానమని, సామాజిక అసమానతలు ఉండవని తన కీర్తనల ద్వారా భక్తి మార్గాన్ని ప్రబోధించినట్లు వివరించారు. ఉదయం 9 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు మధుసూదన్ రావు బృందం గాత్ర సంగీత కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు చెన్నై కి చెందిన ప్రియా సిస్టర్స్ బృందం సంగీత సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు డాక్టర్ విభీషణ శర్మ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అలరించిన భీష్మ ప్రతిజ్ఞ హరికథ

ప్రజాశక్తి- సోమల

సోమల పంచాయతీ భారతం మిట్టలో జరుగుతున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో శుక్రవారం మధ్యాహ్నం హరికథ భాగవతారిణి గీతవాణిచే భీష్మ ప్రతిజ్ఞ హరికథ భక్తులను ఆకట్టుకుంది. వాయిద్యాలుగా హార్మోనియం ఎం.సురేష్, తబలా సురేష్, వయొలిన్ భద్ర సహకారం అందించారు.

ఆకట్టుకున్న అర్జున తపస్మాన్

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలం యామగానపల్లి గ్రామ పంచాయతీ, యమగానపల్లి గ్రామంలో నెలకొని ఉన్న ధర్మరాజుల దేవస్థానం నందు 18 రోజుల మహాభారతంలో భాగంగా శుక్రవారం నాడు అర్జునుడు తపస్మాను ఎక్కుట అనే ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు.. సుమారు నియోజకవర్గంలోని 86 గ్రామాలకు చెందిన ఈ ఈ ఆలయమునందు ప్రతి ఏటా అంగ రంగ వైభవంగా ఈ యొక్క మహా భారతాన్ని నిర్వహిస్తారు... భక్తులు తమ తమ మొక్కుబడులు తీర్చుకుంటూ ధర్మరాజుల ఆలయం నందు... మహాభారత కాలక్షేపాన్ని వీక్షిస్తారు.... ప్రతిరోజు ఆలయం నందు అన్నదానము తీర్థ ప్రసాదాలు అందజేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు

ఎంపీ అభ్యర్థిని కలిసిన సూరిరెడ్డి

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి మిట్టకు చెందిన తెలుగుదేశం నాయకుడు సూరిరెడ్డి శుక్రవారం చిత్తూరులో చిత్తూరు పార్లమెంట్ తెలుగుదేశం అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాద్ రావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి కొద్దిసేపు మాట్లాడారు. వారి వెంట నవీన్ రెడ్డి, అజిత్ రెడ్డి, సాయి భరత్, ప్రకాష్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మనపల్లి ఏపీ మోడల్ స్కూల్లో ఖాళీగా ఉన్న 7, 8,9 తరగతుల సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు అని స్కూల్ ప్రిన్సిపల్ అనిత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కూల్ సీట్ కొరకు విద్యార్థులు తల్లిదండ్రులతో వచ్చి స్కూల్‌లో కలవాలని, చిన్నపాటి పరీక్ష ఉంటుందని మండలంలోని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈవిఎం కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : పోల్డ్ ఈవిఎంలు భద్రపరచిన శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూం భద్రత ఏర్పాట్లను, కౌంటింగ్ ఏర్పాట్లను తిరుపతి జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ పరిశీలించి కౌంటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులకు సూచించారు. శుక్రవారం స్ట్రాంగ్ రూంల భద్రతను పరిశీలించి, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఆరు నియోజక వర్గాల కౌంటింగ్ కేంద్రాలు, తిరుపతి పార్లమెంటరీ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ఏర్పాట్లను, మెష్, బ్యారికేడింగ్ సీటింగ్ తదితర అంశాలపై డిఆర్‌ఓతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యుత్ సరఫరా నిరంతరంగా ఉండేలా జనరేటర్ తగు సామర్థ్యం ఉండేలా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. సీసీటీవీ కెమెరాల కంట్రోల్ రూం నందు ఈవిఎం లను పరిశీలించారు. సందర్శకుల రిజిస్టర్ నందు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, అదనపు ఎస్పీ ఎ.ఆర్ శ్రీనివాస రావు, శ్రీకాళహస్తి రిటర్నింగ్ అధికారి రవి శంకర్ రెడ్డి, సత్యవేడు రిటర్నింగ్ అధికారి నరసింహులు, జిల్లా సర్వే అధికారి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యం : ఎస్‌పి

జిల్లా స్పెషల్ పార్టీ పోలీసులతో శుక్రవారం తిరుపతి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల సమస్యలు వచ్చినప్పుడు స్పెషల్ పార్టీ పోలీసులు ముఖ్యంగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. గతంలో ఎస్‌టీఎఫ్ సిబ్బంది ఎలాంటి రిమార్క్స్ లేకుండా అందరూ ఎస్పీల దగ్గర పని చేశారని, ఇదే స్ఫూర్తితో రానున్న ఈ పది రోజులు ఎంతో కీలకమని, అందరూ మంచిగా విధులు నిర్వహించాలన్నారు. జిల్లా ఎస్‌టిఎఫ్‌లో మీరేం చేసినా దాని ప్రభావం జిల్లా పోలీసుల పై ఉంటుందన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తినప్పుడు, మీరు చాలా స్పీడ్‌గా వెళ్లాల్సి ఉంటుందని, దానికి తగ్గట్టుగా సంసిద్ధులై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు శ్రీనివాసరావు, ఏఆర్ డిఎస్పిలు రవీంద్రారెడ్డి, రమణయ్య, ఆర్‌ఐలు హరికష్ణ, రమణ, రమణారెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ టి.జనార్దన్‌కు రామకృష్ణ అభినందనలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అందుకున్న విశాలాంధ్ర మాజీ బ్యూరో, ఏపీయూడబ్ల్యూజే జిల్లా మాజీ అధ్యక్షులు టి.జనార్దన్‌ను అభినందిస్తూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ అభినందనలు తెలిపారు. శుక్రవారం తిరుపతి సిపిఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశం అనంతరం జనార్ధన్‌ను దుశ్శాలువాతో సన్మానించారు. జర్నలిజం చేస్తూనే పార్టీలో వివిధ బాధ్యతల్లో పనిచేస్తూ పిహెచ్‌డి పూర్తిచేసి డాక్టరేట్ అందుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, విశ్వనాథ్, నదియా పాల్గొన్నారు

ఇంటర్ సప్లిమెంటరీకి 591 మంది గైర్హాజరు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ:

శుక్రవారం ప్రారంభమైన ఇంటర్ ద్వితీయ, ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలలో జిల్లావ్యాప్తంగా 591 మంది విద్యార్థులు పరీక్షలకు గైరహాజరయ్యారని ఆర్ ఐ ఓ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 983 మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షలకు 872 మంది హాజరయ్యారని, 111 మంది గైరహాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరిగిన ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలకు 7220 మంది దరఖాస్తు చేసుకోగా 6,740 మంది హాజరయ్యారని, 480 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వెల్లడించారు.

పిన్నెల్లి కేసులో కోర్టు ఆదేశాలు ఆశ్చర్యం

ప్రజాశక్తి-తిరుమల : పిన్నెల్లి కేసులో కోర్టు ఆదేశాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. పిన్నెల్లిని అరెస్ట్ చేయడంలో పోలీసులు కాలక్షేపం చేశారని అన్నారు. ఈవీఎంలు పగలగొట్టిన వ్యక్తికి కోర్టులు ఎలా రక్షణ కల్పించాయని ప్రశ్నించారు. భారత దేశ చరిత్రలో ఇలాంటి తీర్పు వచ్చి ఉండదని అన్నారు. ఉన్నత న్యాయస్థానాలు ఈ తీర్పుపై పునరాలోచించాలని కోరారు. పిన్నెల్లిని అరెస్ట్ చేసి జైలుకు పంపితేనే ప్రజాస్వామ్యంపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని అన్నారు.

శ్రీవారి అభిషేక సేవలో సంజయ్‌జాజు దంపతులు

ప్రజాశక్తి - తిరుమల: భారత సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు దంపతులు తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం ప్రాత్ణ కాల సమయంలో అభిషేక సేవలో దర్శించుకున్నారు. గురువారం సదరు భారత కార్యదర్శి తమ శాఖకు చెందిన ఆల్ ఇండియా రేడియో, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, దూరదర్శన్ ఉన్నత స్థాయి అధికారులతో తిరుపతి నందు సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వీరి వెంట లైజన్ అధికారి బాల కొండయ్య సంబంధిత అధికారులు ఉన్నారు.

సోలార్ ప్లాంట్ పూర్తి చేయండి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

పెండింగులో వున్న సోలార్ ప్లాంట్ పనులపై అలసత్వం వద్దని, పనుల పూర్తికి ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ ఐఎఎస్ తెలిపారు. తూకివాకం వద్ద నున్న 6 మెగా వాట్స్ గ్రౌండ్ మౌంట్ సోలార్ ప్రాజెక్ట్ పనులను, అదేవిధంగా వినాయకసాగర్ వద్ద గల 5 ఎం.ఎల్.డి మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని శుక్రవారం కమిషనర్ అదితి సింగ్ ఐఎఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సోలార్ ప్రాజెక్ట్ పనుల అలసత్వంపై కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. వినాయకసాగర్ వద్దనున్న మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించి, మరికొన్ని పనులు పెండింగులో వున్న విషయాన్ని ప్రస్థావిస్తూ పూర్తిస్థాయిలో కేంద్రాన్ని ప్రయోజనంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమాల్లో కమిషనర్ వెంట మునిసిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఏయికామ్ సంస్థ ప్రతినిధి బాలాజీ, డిఈ విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.